లేకపోతే నేనసలు యం.బి.బి.యస్ చదివేదాన్ని; ఈ ఇంగ్లీషు చదువుకున్న మీ ఆఫీసులోని అమ్మాయిలకు మల్లే "ఫీస్-పాస్" మంటూ బొట్లేరు ముక్కలు పేలేదాన్ని.

అప్పుడు నామాటల్ని - నన్నూ యింత తేలిగ్గాకొట్టిపారెయ్యలేరు మీరు. మీ ఆఫీసులో పనిచేస్తూ ఉంటుందట - కిరస్తానీపిల్ల - నల్లగా చింతమొద్దులా వోగౌను చుట్టేసుకుని ఎత్తుమడమల జోళ్ళేసుకుని ఓపెనసలు ముక్కా అప్పడాల కట్టలా చిన్న పుస్తకము పట్టుకొని మొగాళ్ల ముందు కూర్చుని అవతల వాడినోట్లోంచి ఏ ముక్క ఊడిపడితే అది పుటుకూ పుటుకూ రాస్తుందిట (వాడిమొహంకేసి చూస్తూ సిగరెట్టు పొగపీలుస్తూ). అదేం ఉద్యోగమో: అది బజారులో కనిపించి "హవుడుయుడూ" అంది నీపిండాకూడు తెలుగు మాట్లాడు అందా మన్నంత కోపం వచ్చింది. కానీ బావుండదని చిన్న నవ్వునవ్వేసి పిల్లల్నీడ్చుకుంటూ రిక్షాలోకొచ్చి పడ్డాను.

అయితే చదువుకున్న ఆడవాళ్లు మాచదువుకోని స్త్రీలను చూసినంత హీనంగా మీచదువుకున్న మగాళ్లు చదువుకోని పురుషులను చూడరు.

చదువుకోని ఆడవాళ్ళతరం నాతోటే ఆఖరవుతుందిలెండి. రేపు నా పిల్లలు నేను పడేపాట్లు పడరు:

# పుస్తకాలు - పరధ్యాస

ఏమిటండీ వెతుకుతున్నారు? మీ పుస్తకాలుకాని, మీ కాగితాలుకానీ ముట్టుకుంటే వొట్టు! ఒకచోట పెట్టి ఒకచోట వెతుకుతారు. అయినా ఇంటినిండా ఆ దిక్కుమాలిన పుస్తకాలొకటమ్మా! అలమర్లన్నీ నిండిపోతున్నాయి. బల్లమీద-గూళ్ళ లోనూ, కిటికీలోనూ, పక్కలమీద నా నెత్తిమీద ఎక్కడ పడితే అక్కడ పుస్తకాలు; ముఖ్యమైన కాగితాలు ఉత్తరాలు చదువుతూ ఏదో పుస్తకంలో పెట్టేసి మర్చిపోతారు కనపడకపోతే నా మీద ఎగిరిపోతారు. ఆడదానికి బద్ధకమూ, మగవాడికి పరధ్యాసా పనికిరాదమ్మా!

నేను మీ బల్ల కెలికేసానంటున్నారా? మీ పెన్ను, తాళం చెవులూ కళ్ళజోడూ కనపట్టంలేదా? పిల్లలున్న ఇల్లు -ఎక్కడ వస్తువు అక్కడ ఎలా వుంటుంది చెప్పండి? మీ కలంతో రాయవద్దని ఎన్నిమాట్లు చెప్పాననుకున్నారు? అయినా వాళ్ళ పెన్నులు కనిపించకపోతే బల్లమీద ఎదురుగుండా వున్నదికదా అని మీ పెన్ను రాము రమ బళ్ళోకి పట్టుకుపోతారు. నాన్నగారి వస్తువులు ముట్టుకోకూడదన్న జ్ఞానం వాళ్ళకి ఎప్పుడొస్తుందో .... అదిగో కళ్ళజోడు ఇక్కడ పెట్టారు. అక్కడ వెదుకుతున్నారు. ఈ పుస్తకాలమధ్య పడిపోయింది. అవతల కుంపట్లోచారు మరిగి

పోతోంది. కేరియరు సర్దాలి! పసిపిల్లను పంపించి స్కూల్లో మర్చిపోయాడేమో మల్లిబాబుపలక వెతికించాలి. రోజూ వో పలక - ఆ బూట్లు పాలిష్ చేయాలి. సాక్స్ ఉతికినవి, వెతికితీయాలి. మీకు కూడా అన్నీ వెతికి చేతికందీయటానికి నాకు తీరిక ఎక్కడ వుంటుంది చెప్పండి?

అన్ని విషయాలెందుకు ఒక్కమాటు ఆలోచిస్తారు? ఆ చేతులు తిప్పుకుంటూ ఆ పచార్లేమిటండీ? మీలో మీరు మాట్లాడుకుంటూ మీలో మీరు నవ్వుకుంటూ వుంటారు. బయట కూడా ఇలానే వుంటారా? ఆ పుస్తకాలన్నీ చదివి ఇలా తయారవుతున్నారు. మిమ్మల్ని చూస్తుంటే ఏమిటో ఒకప్పుడు నాకు భయం భయంగా వుంటుందండీ!

ఆ చేతిలో పుస్తకం ఇలాయిచ్చి వోమారు అలా బజారు కెళ్ళొస్తారా? పంచదార అయిపోయింది. నిన్నరాత్రి పచ్చడి మెతుకులు తిన్నాము. ఈ పూటైనా కూరలుతెస్తారా - వంకాయలు మీకు ఏరటం తెలీదు. అరటికాయలు బంగాళదుంపలు పట్రండి, గోంగూరవద్దు. మిరపకాయలూ - నూనె మింగేస్తుంది. పచ్చి మిరపకాయలూ, అల్లం, ఉల్లిపాయలు మర్చిపోకండి. మీరు పరధ్యాసగా అటూ ఇటూ చూస్తూవుంటే కేజీకి అరకేజియె తూస్తారు. బాబ్బాబు - పుణ్యముంటుంది; రాసుకోడానికి కూర్చోకండి! వారానికి రెండుసార్లేనా బజారు కెళ్ళి ఏవోతెచ్చి నా మొహాన తగలెయ్యకపోతే ఏం పెట్టి వండుతాను? కాళ్ళూ చేతులు పెట్టి వండాలి. నా ఖర్మ; బతిమాలినా నయాన చెప్పినా మొత్తుకున్నా వినరు. అప్పుడే బట్టలు వేసుకున్నారూ? ఎక్కడికీ మీటింగుకా - అయితే నేను ఇంత సేపటినుంచీ చదివిన చదువంతా గాలిలో కలిసి పోయిందీ?

ఆ డబ్బు లక్కడ పెట్టండి. నేనేవెళ్ళివీధిలో పడతాను తగదు నమ్మా అంటూ. ఇంకా స్నానం చేయాలి. తలదువ్వుకోవాలి. బట్టకట్టుకుని బొట్టు కాటుకా పెట్టుకుని తెవిలి వెళ్ళాలంటే చాలా సేపు పడుతుంది. ఇల్లు పనిపిల్లకు వప్పచెప్పి వెళ్ళితే దానికీ ఏ క్షణాన ఏ బుద్ధిపుడుతుందో - ఏవేనా ఎత్తుకుపోతే: ఒక నేతి గరిటిపోతే మళ్ళీ కొనుక్కొలేం?

అయ్యో వెళ్ళిపోయారు నేనిలా వాగుతోంటే వాక్కుంటే వాక్కుంటుందీ - దీని వాగుడు మనకేం లక్ష్యం - అని నా మొహాన కొట్టినట్టు వెళ్లిపోయారా? అవున్లెండి - నన్ను కట్టుకున్నారు. ఈ సంసారమంతా నా వల్లపెరిగిన సంసారమే కదా! మీరు మహారాజులు - దిక్కుమాలిన జన్మమ్మా ఏంజన్మ ఆడజన్మ? ఓ సినిమా కెళ్ళాలంటే దీనికి ముక్కుతుడవాలి! దానికి మూతి తుడవాలి; వాడికి నీళ్ళుపోయాలి ఈ మూకనంతా సవరించి లాగూలూ చొక్కాలూ కట్టి సిద్ధంచేస్తే ఆయన ఇంతమందినీ వెంటేసుకుని వీధిలో కెళ్ళటానికి సిగ్గుపడిపోతారు. ఆ సంగతి చెప్పలేక పదిరూపాయలిస్తాను. మీరంతా వెళ్ళిరండి. ఆ తెలుగు సినిమాలు నాకు బోరు కొట్టేస్తాయి అని తప్పించు కుంటారు. రిక్షాకూడా బేరవాడ నివ్వరు. అడిగినంతా యిచ్చేయాలిసిందే -

అంచేత ఈ ఇల్లు నాకు రాసి పెట్టివుంది. ఈ సంసారం నాపీకకు ఉరిత్రాడు. నన్ను ఎన్ని రకాలుగా ఏడిపించాలో అన్ని రకాలుగా మీ ఇష్టం వచ్చినట్లు ఏడిపించండి;

డ్రస్సు వేసుకుని జోళ్ళు టకటక లాడించు కుంటూ మాటా మంతీ లేకుండా వెళ్లిపోయారు గదూ?

ఇంట్లో వున్నంతసేపూ చిరాకు పడిపోతూవుంటారు. నా మొహం చూసే అనుకుంటాను.

అయ్యో! నా మతి మండిపోనూ - ఏదీ చంటిపిల్ల... ఎక్కడా? ఇప్పుడిక్కడ ఆడుకుంటున్నదే. ఏదీ? నా చిన్న చిన్న కాసులు? నావజ్రమాణిక్యాలూ? నా వరహాలదివ్వె? నా అపరంజి బొమ్మ - ఎక్కడ దాక్కున్నావ్? వొసి నీ... ఈ మంచం క్రింద ఏం చేస్తున్నావే? రామ్మా లాలపోస్తాను. బూడిద బుస్సమ్మ లాగున్నావు.

ఎందుకే ఆ బోసినవ్వులూ?

అక్కా - అన్నయ్యల పుస్తకాలన్నీ చింపుతున్నావా మూల కూర్చుని - వాళ్లొచ్చి ఏడుస్తారే... టైమెంతయింది చెప్మా? రేడియో కట్టేసారే.... వాళ్ళకి ఇళ్లూ వాకిళ్లూ వుండవూ ఆ రేడియో ముందు అరుస్తూ కూర్చుంటే ఇంట్లో యిల్లాళ్ళేవయి పోతారు? నాలాగే తిట్టుకుంటూ తిమ్ముకుంటూ... దిక్కుమాలిన జీవితాలు... ఆడబతుకే మధురం అన్నాట్ట ఎవడో - పిల్లలు ఈ మొగుడు ఈ సంసారం నా చుట్టూ చక్రంలా తిరుగుతోంది - నేను లేకపోతే...

అయ్యో నా మతిమండా - టిఫిన్ చేసి పెట్టడం మర్చి పోయాను. పాపం తినకుండా వెళ్లిపోయారు. కడుపులో ప్రేగులు అరుస్తాయి. దిక్కుమాలిన దాన్ని: అయితే గుమ్మటంలా ఇంట్లో కూర్చునేదాన్ని నాకెందుకు? నాకూ అక్కర్లేదు టిఫిను.... .... ....

# నా హార్మోనీ పెట్టెలో ప్రేమలేఖలు

**ఉ**త్తరం రాయడమంటే ఏమిటో బద్ధకమండీ? కలం కనిపించదు కాగితం కనిపించదు. రెండూ కనిపిస్తే పిల్లవూరుకోదు. ఈ మూకతో నా బొంద. ఉత్తరాలు రాయడంకూడా పడుతుందా? ఉత్తరాలంటే జ్ఞాపకమొచ్చింది - చిన్నప్పుడు మనం ఊరికే రాసుకునేవాళ్ళం కామూ? మొన్న హర్మనీ పెట్టెలో అట్టడుగున నా పాటల పుస్తకంలో దొరికాయి కొన్ని ఉత్తరాలు... అవి చదువుతూవుంటే మీరూ నేనూ పది పదిహేనేళ్ళ వెనక్కు వెళ్ళిపోయాం. అప్పుడు మీరు రాసిన ఉత్తరాలు ఇప్పటికీ చదువు కుంటే బాగానే అనిపించింది. పిల్లలు తీసి చూస్తారేమో కర్మ; మీ ఉత్తరం కోసం వీధిలోంచి ఇంట్లోకి, ఇంట్లోంచి వీధిలోకి తిరిగేదాన్ని. అమ్మడూ నీకు ఉత్తరం వచ్చిందే అంటూ నాన్న నామీద కవరు గిరాటు పెట్టగానే నాకు ఎలా వుండేదంటారు? ఆ ఉత్తరంలో మీరు రాసిన సంగతులు చదువుతోంటే ఎవరో మల్లెపూలు విసిరినట్లు మంచి గంధం చల్లినట్లు మనసు పరవశించి పోయేది.